## క్లుప్తంగా

### మరిడమ్మ ఆలయ ట్రస్టీ బ్రహ్మాజీ ఇకలేరు

పెద్దాపురం: గ్రామంలోని మరిడమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ(78) సోమవారం మృతి చెందారు. ఆలయ ట్రస్టీ వంశపారంపర్యంగా కొనసగుతున్న బ్రహ్మాజీ లేరన్న మరణవార్త పట్టణ ప్రజలను విషాదంలో ముంచేసింది. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన చికిత్స పొందుతూ సామర్లకోట ఆయన నివాసంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బ్రహ్మాజీ మృతిపై ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి, సిబ్బంది, పట్టణ ప్రముఖులు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

### బాలకృష్ణప్రసాద్ మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటు

పిఠాపురం: ప్రఖ్యాత సంగీత విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటు అని పలువురు వక్తలు (సంగీత ప్రియులు) అన్నారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో సోమవారం బాల కృష్ణ ప్రసాద్ సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంగీత ప్రపంచానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన స్వరపరచిన అన్నమాచార్య కీర్తనలను కళాకారులు గానం చేసి స్వరార్చనతో ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో గట్టి శ్రీకృష్ణ దేవరాయలు, జి.సత్య, వింజమూరి గాయత్రి, ఆకొండి వెంకట్రావు, ఆయన శిష్యబృందం, సుబ్బరాయ శర్మ, నాట్యాచార్యులు లోకేశ్, కొండేపూడి శంకరరావు, సుబ్బారావు, జగన్నాథ శర్మ తదితరులు పాల్గొన్నారు.

### పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫాల్గుణ మాసం ఏకాదశి పర్వ దినం, స్వామి వారికి ప్రీతైన సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో ఆలయ పండితులు నిర్వహించిన తొలి అభిషేకం, తొలిపూజలను తిలకించడానికి క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణలు చేశారు.

### హిందూ ధర్మ గొప్పతనాన్ని చాటి చెప్పాలి

సామర్లకోట: హిందూ ధర్మ గొప్పతనాన్ని ప్రపంచమంతా చాటాలని విశ్వహిందూ పరిషత్తు భాగ్యనగర క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యంజీ అన్నారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలో ఉండూరు గ్రామంలో నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 60 ఏళ్లుగా మన రాష్ట్రీయ స్వయం సేవా సంఘ్, విశ్వహిందూ పరిషత్తులు దేశ ధర్మం గురించి పాటుపడుతున్నారు. నాయకులు మల్లేశ్వరీ, గోరకపూడి చిన్నయ్యదొర, గల్ల సుబ్బారావు, డాక్టరు పార్ధసారధి పాల్గొన్నారు.

### పరీక్షా సామగ్రి పంపిణీ

సామర్లకోట: ఈనెల 17 నుంచి జరుగుతున్న 10వ తరగతి పరీక్షల్లో మంచి విజయాలు సాధించాలని మండల ఫాస్టర్ల ప్రతినిధులు డాక్టరు టి.బ్లెస్సింగ్, రాజమహేంద్రవరం సీనియర్ ఫాస్టర్ మోజెస్‌బాబులు అన్నారు. మండల ఫాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల కోసం సోమవారం సాయంత్రం సీబీఎం హైస్కూల్ ఆవరణలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగాప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్, రబ్బర్లు అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు జి.జయబాబు, కరుణకుమార్, శైలష్, డాక్టరు పి.ఆనంద్‌బాబు, డాక్టరు ఎంఏ జేమ్స్, మోజెస్, అబ్రహం, మడకి సోనియా తదితరులు పాల్గొన్నారు. సుమారు 500 మంది విద్యార్థులకు ఉపయోగపడే మెటీరియల్ అందజేశారు.

### భక్తిశ్రద్ధలతో రథోత్సవం



వేట్లపాలెంలోని సోమేశ్వరస్వామి రథోత్సవం

సామర్లకోట: వేట్లపాలెంలో వేంచేసి ఉన్న అతిపురాతన రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వర స్వామి కల్యాణ ఉత్సవాల్లో సోమవారం అత్యంత వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి స్వామివారి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పూలతో, విద్యుత్తు దీపాలతో అలంకరణ చేసిన రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా స్వామి రథోత్సవం రావడంతో భక్తులు స్వామివారిని అమ్మవారి దర్శించుకొని మొక్కులు తీసుకున్నారు. ఆలయ కమిటీ నాయకుల పాలచర్ల రాంబాబు, పాలచర్ల సతీష్, మన్యం రామ్‌తేజ, సాయిరామ్ భక్తులకు సేవలందించారు. స్వామి వారి రథోత్సవాన్ని పురస్కరించుకొని మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. రథం ఆలయానికి చేరిన తరువాత రాత్రి స్వామి వారి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించి కల్యాణం జరిపించారు. కల్యాణం తిలకించడానికి భారీగా భక్తులు తరలివచ్చారు.

# యువత పోరును విజయవంతం చేయండి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- పిఠాపురంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పిఠాపురంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వంగా గీత



సామర్లకోటలో ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరించిన దవులూరి దొరబాబు తదితరులు

పిఠాపురం: పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 12న వైఎస్సార్ సీపీ నిర్వహించ తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత పిలుపునిచ్చారు. పిఠాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం యువత పోరు వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి నేతలు విద్యారంగానికి, యువతకు నిరుద్యోగులకు, మహిళలకు ఇచ్చిన హామీలు తుంగలోకి తొక్కారన్నారు. ఎన్నికల సమయంలో బహిరంగంగా ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం విద్యావ్యవస్థను కుంటుపడేలా చేసిందని, దీంతో మహిళలు విద్యలో వెనుకబడే అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తూ విద్యార్థులకు ఇవ్వాల్సినవి ఇవ్వడం లేదన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం కాకినాడలో యువత పోరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

**గత ప్రభుత్వంలో విప్లవాత్మక మార్పులు**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. విద్యార్థుల కోసం అనేక పథకాలు అమలు చేయడం ద్వారా పాఠశాల విద్య నుంచి కళాశాలల వరకూ అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. ఆయన ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వ నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఆయా సమస్యలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, యువత, మహిళలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో వారి తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తోందన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే యువత పోరు కార్యక్రమంలో విద్యార్థులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పార్టీ పిఠాపురం పట్టణ, మండలాల అధ్యక్షులు రావుల మాధవరావు, అడపా రఘు, ఆనాల సుదర్శన్, గండేపల్లి బాబీ, తలిశెట్టి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

**ఫీజు పోరును విజయవంతం చేయాలి**

సామర్లకోట: విద్యార్థుల సమస్యలలో భాగంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12వ తేదీన నిర్వహిస్తున్న ఫీజు పోరును విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఫీజు పోరు పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలలో విద్యార్థులతో పాటు అన్ని వర్గాల వారిని చంద్రబాబు మోసం చేశారని తెలిపారు. విద్యా వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. విద్యా దీవెన, వసతి దీవెనకు నిధులు విడుదల చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12వ తేదీన కాకినాడ కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున నిర్వహించే ధర్నా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. పేద పిల్లలు ఉన్నత చదువులు చదువుకునేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని విజయవంతంగా నిర్వహించారన్నారు. దాంతో వేలాది మంది డాక్టర్లు, ఇంజినీర్లు తయారయ్యారని చెప్పారు. విద్యార్థులను మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి విద్యార్థుకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందని భరోసా ఇచ్చారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, పార్టీ నాయకులు, కార్యకర్త లు హాజరుకావాలన్నారు. ప్రశ్నించే వారు లేకుండా చేయడానికే అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని దొరబాబు ఆరోపించారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్‌చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అత్తిలి వెంకటసీతారామస్వామి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మోరంపూడి రంగనాయకులు, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్, పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వారా సుధాకర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు పాగా సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, మాజీ పట్టణ ఆర్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రొటోకాల్ రగడ

- వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- మహిళా దినోత్సవం రోజున కౌన్సిల్‌కు కబురేదంటూ ఆగ్రహం
- పందులు, కుక్కల స్వైర విహారంపై చర్యలేవంటూ మండిపాటు
- వేసవి మంచినీటి ఇబ్బందులపై చర్చ



మున్సిపల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న సీనియర్ కౌన్సిలర్ రాజశేఖర్

పెద్దాపురం: కౌన్సిల్ సభ్యులంటే మున్సిపల్ అధికారులకు లెక్కలేదని, కనీసం ప్రొటోకాల్ పాటించకుండా అధికారుల తీరు అధ్వానంగా ఉందంటూ పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ ధ్వజమెత్తింది. మెప్మా విభాగ అధికారులు నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు కౌన్సిల్ సభ్యులను ఆహ్వానించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్, ఆరెళ్లి వీర్రాఘవులు మాట్లాడుతూ మెప్మా విభాగం అధికారులు ప్రవర్తించిన తీరుపై మండిపడ్డారు. కనీస మహిళా కౌన్సిలర్లకు అయిన సమాచారం అందించి ఉంటే బాగుండేదని, కేవలం మెప్మా అధికారులే కౌన్సిల్ సభ్యులను పక్కన పెట్టి అగౌరవ పర్చడం సరైన పద్ధతి కాదన్నారు. కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో పందులు స్వైర్య విహారంపై పందులు యజమానులతో సమావేశం నిర్వహించాలని గత కౌన్సిల్‌లో సూచించినా పందుల సంచారంపై చర్యలేవన్నారు. ప్రతి వార్డుల్లో కుక్కలు, పందులు స్వైర్య విహారం చేస్తున్నాయని సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుత వేసవి నేపథ్యంలో పట్టణంలో మంచినీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని ఆయా కమ్యూనిటీ హాల్స్ వద్ద జరిగే విందు భోజనాలతో వచ్చే చెత్త మున్సిపల్ శానిటరీ సిబ్బంది ఎత్తుతున్న నేపథ్యంలో ఫంక్షన్‌దారుల వద్ద నుంచి మున్సిపాలిటీకి రావాల్సిన సొమ్ములు ఎందుకు వసూలు చేయడం లేదన్నారు. తద్వారా మున్సిపాలిటీ ఆదాయ వనరులకు గండిగొడుతున్నారంటూ మండిపడ్డారు. స్థానిక మెయిన్‌రోడ్డు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌ను అదే స్థలం పునర్నిర్మించాలని రాజశేఖర్ కోరారు. కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, వీర్రాఘవులు, విడదాసరి రాజా మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య పనులు మెరుగుపర్చాలన్నారు. పార్కు నిర్వహణపై మరింత శ్రద్ధ వహించి ప్రజలకు ఆహ్లాద కరమైన వాతావరణం కల్పించాలన్నారు. అనంతరం పలు సమస్యలపై వాడీవేడిగా చర్చ నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ ప్రకాశరరావు, మేనేజర్ జ్యోతిరాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, ఆయా విభాగాల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ తులసీ మంగతాయారు

# ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ పోరాటం

- ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- పార్టీ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపు



విలేకర్లతో మాట్లాడుతున్న వంగా గీత, నాయకులు

పిఠాపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా మారి ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత అన్నారు. పిఠాపురం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 12న నిర్వహించే పార్టీ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేటలో మార్చి 12న పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పార్టీని ప్రారంభించారన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజల పక్షాన పోరాడుతూ, ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. పార్టీ పిలుపు మేరకు ఉత్తరాంధ్రా రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. పిఠాపురంలో నిర్వహించే ఆవిర్భావ వేడుకల్లో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి పీజీఆర్ఎస్ గ్రీవెన్స్

- పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి
- గ్రీవెన్స్‌కు పది అర్జీలు



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కోసం ప్రతివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించినట్టు పెద్దాపురం కె.శ్రీరమణి అన్నారు. వారం వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి పది అర్జీలు అందినట్టు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచేందకుకరిందేకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ వారంస్పందనకు ఆరు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, గృహ నిర్మాణ శాఖ ఏఈ రవిశంర్, ఐసీడీఎస్ సీడీపీఓ ఉష, అధికారులు పాల్గొన్నారు.

# మహాధర్నాను విజయవంతం చేయండి



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న కార్మిక సంఘం నేతలు

పిఠాపురం: ఉపాధి హామీ, వ్యవసాయ కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఈనెల 12న నిర్వహించతలపెట్టిన మహా ధర్నాను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉపాధి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .మండల పరిధిలోని మంగితుర్తి, విరవాడ, వెల్దుర్తి, పి.తిమ్మాపురం రాయవరం, రాపర్తి గ్రామాల్లో సోమవారం కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లో ఉపాధి నిధులను తగ్గించారని ఆరోపించారు. ఉపాధి పనుల వద్ద ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో ఉపాధి కూలీలు వడదెబ్బకు మృత్యువాత పడుతున్నారని ఆరోపించారు. పని చేసిన ఉపాధి కూలీలకు వారం రోజుల్లో వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్నా నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా ఉపాధి కూలీల కడుపులు మాడుస్తున్నారని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నను ఉపాధి కూలీలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు ఉబా బుల్లబ్బాయి, కాల్దారి రాఘవ, డెక్కల లాజరు, దవ్వాల కృష్ణ, దవ్వాల సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

### వేసవిలో మామిడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

పెద్దాపురం: ప్రస్తుత వేసవి దృష్ట్యా రైతులంతా మామిడి తోటల పెంపకంపై మరింత అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం దుంప పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సునీత, పెద్దాపురం మండల ఉద్యానశాఖాధికారి ఎస్.సుజాత కోరారు. మండలంలోని జె.తిమ్మాపురం, కట్టమూరు గ్రామాల్లో సోమవారం మామిడి తోటల క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికం కానున్న నేపథ్యంలో మామిడి తోటలకు తేలికపాటి తడులు ఇవ్వాలన్నారు. పిందె కట్టే దశలో రెండో దఫా ఎరువులను సిఫారసు ప్రకారం వేసుకోవాలన్నారు. అధికంగా పిందె, పూత రాలుతున్నప్పుడు ప్లానో ఫిక్స్ 4.06 మిల్లి గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

# రోడ్డు పనులు నిలిపి వేత దారుణం




రోడ్డు పనులు నిలిపి వేయడంతో కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న హరిబాబు

సామర్లకోట: స్థానిక 13వ వార్డులో మంజూరైన నిధులతో పనులు ప్రారంభించడానికి మెటీరియల్ రాగ ఆ పనులు నిలిపి వేస్తూ మెటీరియల్‌ను వెనుక తీసుకుపోవడం దారణమని సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం వార్డు ప్రజలతో కలిసి మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు ఫిర్యాదు చేశారు. తన వార్డులో తెలుగుదేశంకు మెజార్టీ ఓట్లు రాలేదనే కక్షతోనే మంజూరైన రోడ్డు పనులు నిలిపి వేస్తూ కుట్రలు చేస్తున్నారని హరిబాబు ఆరోపించారు. దీనిపై కమిషనర్ రోడ్డు పనులు చేస్తామని చెప్పడంతో, పనులు చేయడానికి వచ్చిన మెటీరియల్ తీసి వేస్తే ఎప్పుడు రోడ్డు వేస్తారని హరిబాబు ప్రశ్నించారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకు వెళ్లతామని అప్పటికీ పనులు ప్రారంభించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నిరాహార దీక్షలు చేస్తామని కౌన్సిలర్ హరిబాబు హెచ్చరించారు. వార్డులలో కౌన్సిలర్లకు అధికారం ఉంటుందని చెప్పుతున్న ఎమ్మెల్యే రాజప్ప దీనిపై స్పందించాలని హరిబాబు డిమాండ్ చేశారు.

# మామిడికి తెగుళ్ల బెడద

- పూత, పిందె దశలో ఆశిస్తున్న తెగుళ్లు
- ఆందోళన చెందుతున్న రైతులు
- సస్యరక్షణ చర్యలు పాటించాలంటున్న అధికారులు



పిఠాపురంలో సాగు చేస్తున్న మామిడి తోట

పిఠాపురం: ఈ ఏడాది ప్రతికూల వాతావరణం నేపథ్యంలో మామిడి పూత ఆలస్యం కావడంతో పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పూత, పిందె దశలో మామిడి తోటలు ఉన్నాయి. కాగా మామిడి రైతులను తెగుళ్లు కలవరపెడుతున్నాయి. పూత దశలో మామిడి, జీడి మామిడి రైతులను పొగమంచు కలవరపెట్టినా చివరకు పిందె దశలో ఆశలు చిగురించాయి. ఎక్కడ చూసినా మామిడి చెట్లు కాసి కనిపిస్తుండగా మంచు, ఎండ ఎక్కువగా ఉండడంతో దిగుబడులపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పొగమంచు ప్రభావం పెరగడంతో పాటు ఉష్ణోగ్రతలు పెరగడంతో పిందె రాలిపోవడంతో పాటు మాడిపోయే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

**1833 ఎకరాల్లో మామిడి సాగు**

పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో సుమారు 1833 ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. ప్రస్తుతం కాపు ఆశాజనకంగా ఉన్నా మంచు, ఎండల ప్రభావం రైతులను కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో ఉద్యాన శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మామిడిసాగు అధికంగా ఉన్న ప్రాంతాల్లో తోటబడులు నిర్వహించి మామిడిలో తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలు వివరిస్తున్నారు. ప్రస్తుతం మామిడిపై తెగుళ్లు ఆశించే సమయం కాబట్టి రైతులు సస్య రక్షణ చర్యలు అవలంబించాలని పిఠాపురం ఉద్యాన శాఖాధికారి కెఎస్ శైలజ రైతులకు సూచించారు. తామర పురుగు, ఆకుగూడు పురుగు, తేనె మంచు పురుగు, కాండం తొలుచు పురుగు, పండు ఈగ, పక్షి కన్ను తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను ఆమె రైతులకు వివరిస్తున్నారు.



కేఎస్ శైలజ, ఉద్యాన శాఖాధికారి, పిఠాపురం

**సస్య రక్షణ చర్యలు ఇలా..**

ప్రస్తుతం మామిడి పిందె ఆశాజనకంగా ఉంది. ఈ సమయంలో తగిన సస్య రక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా దిగుబడులు సాధించవచ్చు. మామిడి పూత విచుకున్నప్పటి నుంచి తేలికపాటి తడులు పెట్టాలి. పిందె కట్టిన దశలో, రెండో దఫా సిఫార్సు చేసిన ఎరువులను వేసుకోవాలి. తేనె మంచు పురుగు నివారణకు ఒక లీటరు నీటిలో బుప్రోఫిజిన్ 1.5 మిల్లీ లీటర్లు లేదా బుప్రోఫిజిన్ + ఆసిఫేట్ 1 గ్రాము 1 లీటరుకు, డైనోటేఫ్యూరాన్ 0.2 గ్రాములు 1 లీటరుకు కలిపి పిచికారీ చేసుకోవాలి. దీంతో పాటు వేపనూనె 3 మిల్లీ లీటర్లు జిగురు 0.5 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. తామర పురుగు నివారణకు, నీలం రంగు జిగురు అట్టలు చెట్టును తప్పించి చెట్టుకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసుకోవాలి. పాదులో ఫాలిడాల్, క్లోరోపైరిఫాస్, వేప పిండి వేయడం ద్వారా నిద్రావస్త, కోశస్థ దశలను నిర్మూలించవచ్చు. కాయ నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు పండ్ల కవర్లను తొడగాలి. అధికంగా పూత, పిందె రాలుతున్నప్పుడు ప్లానోఫిక్స్ 2 మిల్లీ లీటర్లు 10 లీటర్ల నీటికి కలిపి, డోసు ఎక్కువ కాకుండా, వేరే ఇతర మందులతో కలపకుండా ఉదయం, సాయంత్రం సమయాల్లో పిచికారీ చేయాలి. జీవన ఎరువులను 250 గ్రాముల చొప్పున పశువుల ఎరువులో కలిపి వాడుకోవడం ద్వారా మొక్కకు పోషకాల లభ్యతను పెంచవచ్చు. కాయ పెరిగే దశలో 13:0:45 10 గ్రాములు లీటరు నీటికి, యూరియా 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే కాయ ఎదుగుదలకు తోడ్పడుతాయి.

# కల్యాణం.. కమనీయం

- వైభవంగా స్వామివార్ల కల్యాణం
- వీక్షించిన భక్తులు



పిఠాపురంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం

కొత్తపల్లి: కొండెవరంలో వేంచేసిన పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. ఉదయం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఘనంగా ఊరేగించారు. స్వామివారికి ధ్వజా రోహణ అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి ఆలయ ప్రధాన అర్చకులు శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు.

కొత్తపల్లి: మండలంలోని మూలపేటలో వేంచేసిన బలభద్ర సుభద్ర సమేత జగన్నాథస్వామి, సత్యనారాయణస్వామి వార్ల కల్యాణం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. జగన్నాథస్వామి, సత్యనారాయణస్వామి వార్ల కల్యాణ మహోత్సవల్లో భాగంగా ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్టాపన, సహస్రనామార్చన, సహస్ర కుంకుమార్చన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సామివార్లకు గరుడ, గజ వాహనాలపై గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన తిరుమల తిరుపతి దేవస్థానం పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ఆలయ అర్చకులు స్వామివారి దివ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**అపర్ణాదేవి నమామ్యహం...!**

పిఠాపురం: మండలంలో తాటిపర్తిలో వేంచేసియున్న అపర్ణా సమేత నాగేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం కనుల పండువగా నిర్వహించిన పూర్ణాహుతితో స్వామివారి కల్యాణోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆకొండి ప్రభాకర శాస్త్రిల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.